సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం ׀ 31 ׀ జనవరి ׀ 2025



ప్రతీకారానికి పరాకాష్ట

తెలుగు తమ్ముళ్లకు కడుపు మంట అధికమవుతోంది. ప్రజలకు తాగునీటిని అందిస్తున్న ప్రభుత్వ నీటి శుద్ధి కేంద్రాలను తొలగిస్తూ ఆనందం పొందుతున్నారు. - 8లో



విచారణతో వెలుగులోకి అక్రమాలు

దేవదాయశాఖకు చెందిన భూమిలో అక్రమంగా ఇసుక తరలింపు, ఆలయాల భూమిలో ప్రైవేటు వ్యక్తులకు లీజులు తదితర అక్రమాలపై గురువారం విచారణ జరిపారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.170	రూ.210
రెండోరకం	రూ.110	రూ.160



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 69 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	675	675
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 37.080 కిలోలు

న్యూస్‌రీల్

చేప పిల్లలు విడుదల

నందలూరు : మండలంలోని కోనాపురం సోమశిల వెనుకజలాల్లోకి 15.80 లక్షల చేప పిల్లలు విడుదల చేశారు. మదన మోహనపురం గ్రామ సర్పంచ్ చుక్క నిర్మల, చుక్క యానాది, ఉప సర్పంచ్ పుల్లయ్యల చేతులు మీదుగా గురువారం ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మత్స్యశాఖాధికారి సుస్మిత, అధికారులు వెంకటరమణ, రామమోహన్ పాల్గొన్నారు.

చీడపీడల నిఘా వ్యవస్థపై అవగాహన ఉండాలి

కేవీపల్లి : జాతీయ చీడపీడల నిఘా వ్యవస్థ యాప్‌పై రైతులు అవగాహన ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ అన్నారు. గురువారం మండలంలోని మహల్‌రాజుపల్లె పంచాయితీ హిస్సాపల్లెలో ఉలవపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలను చీడపీడలు ఆశించిన సమయంలో నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. పీలేరు ఏడీఏ వై.వి.రమణరావు, వ్యవసాయాధికారిణి శ్రావణి, వ్యవసాయ విస్తరణాధికారులు ఇంద్రసేనారెడ్డి, అనితాదేవి పాల్గొన్నారు.

ఒంటిమిట్టకు చేరిన లడ్డూలు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయానికి గురువారం తిరుమల శ్రీవారి లడ్డూలు చేరాయి. తిరుమల నుంచి ప్రత్యేక వాహనంలో 2 వేల లడ్డూలు వచ్చాయి. గతంలో రెండు, నాలుగో శనివారాల్లో ఇచ్చే లడ్డూలు గత కొన్ని నెలలుగా ప్రతిరోజూ ఇస్తున్నారు.

3న వేలం పాట

రాజంపేట టౌన్ : పవిత్ర పుణ్యక్షేత్రం హత్యరాలలో టెంకాయలను విక్రయించుకునేందుకు ఫిబ్రవరి 3వ తేదీ ఉదయం 11 గంటలకు త్రేతేశ్వర స్వామి ఆలయ ఆవరణలో బహిరంగ వేలం పాటను నిర్వహించనున్నట్లు సమూహ దేవస్థానాల కార్యనిర్వహణాధికారి గంగవరం కొండారెడ్డి గురువారం తెలిపారు. వేలంపాటలో పాల్గొనే ప్రతి ఒక్కరు ధరావత్తు కింద రూ.50 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వేలంపాట దక్కించుకున్న వారు ఒక్కో టెంకాయను రూ.50కి మాత్రమే విక్రయించాలన్నారు. దేవస్థానానికి బకాయిలు ఉన్నవారు, వాజ్యం ఉన్నవారు, మైనర్లు, హిందూయేతరులు వేలంపాటలో పాల్గొనేందుకు అనర్హులన్నారు. వేలంపాటను దక్కించుకున్న వారు ఈఏడాది ఫిబ్రవరి 3వ తేదీ నుంచి వచ్చే ఏడాది జనవరి 31వ తేదీ వరకు మాత్రమే హత్యరాలలోని త్రేతేశ్వర స్వామి ఆలయ పరిసర ప్రాంతంలో టెంకాయలను విక్రయించుకోవచ్చని తెలిపారు.

కేజీబీవీ ఎస్‌వోకు షోకాజు నోటీస్ జారీ

పెద్దమండ్యం : మండలంలోని శిద్దవరం కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) లో పురుగుల అన్నం... నీళ్ల సాంబారు.. విద్యార్థుతో బాతురూంల శుభ్రం చేయిస్తున్న ఫోటోలు సామాజిక మాధ్యమాలలో బుధవారం వైరల్ అయ్యాయి. ఈ ఫోటోలు జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యంకు చేరడంతో కేజీబీవీ ఎస్‌వో రాణికుమారికి షోకాజు నోటీసు జారీ చేశారు. డీఈవో ఆదేశాల మేరకు గురువారం ఇద్దరు ఎంఈవోలు, క్లస్టర్ హెచ్‌ఎం, మరో మహిళా హెచ్‌ఎం, ఉపాధ్యాయురాలు కేజీబీవీలో విచారణ నిర్వహించారు. ప్రతి తరగతిలో ఉన్న విద్యార్థినులను విచారించి వివరాలను సేకరించారు.ఇవి పాత ఫొటోలని బాతురూంలు శుభ్రం చేస్తూ ఫొటోలో ఉన్న ఇద్దరు విద్యార్థులు విచారణలో వెల్లడించినట్లు సమాచారం. కాగా కెజిబివిలో ఎప్పుడు, ఎవరు ఫోటోలు తీశారనేది తెలియరాలేదు. విచారణలో సేకరించిన వివరాలను డీఈవోకు నివేదిస్తామని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఎంఈవోలు మనోహర, జి.రామక్రిష్ణ, క్లస్టర్ హెచ్‌ఎం కె రామచంద్ర, ఉర్దూ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రషీదాబాను, ఉపాధ్యాయురాలు జి సుగుణ పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన ఎస్‌ఐ

– సీఐ ప్రమేయం కూడా..



సీఐ రమేష్



ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య

రామసముద్రం : ఓ లారీ యజమాని నుంచి లంచం తీసుకుంటూ రామసముద్రం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య గురువారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. మదనపల్లె నియోజకవర్గంలోని రామసముద్రం మండలం వనగానిపల్లె సమీపంలోని ఏటవాకిలి క్రాస్ వద్ద లారీ ఢీకొని ఇద్దరు మృతిచెందారు. దీనికి సంబంధించి సూళ్లూరుపేటకు చెందిన లారీ ఓనర్ మనోజ్‌ను ఎస్‌ఐ లంచం డిమాండ్ చేశారు. దీంతో లారీ యజమాని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. రామసముద్రం పెట్రోల్‌బంక్ వద్ద లారీ యజమాని నుంచి ఎస్‌ఐ రూ.70వేలు లంచం తీసుకుంటుండగా, ఏఎస్పీ విమలకుమారి, ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి ఆధ్వర్యంలో దాడి చేసి పట్టుకున్నారు. ఎస్‌ఐను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. లంచం తీసుకున్న విషయంలో మదనపల్లె సీఐ రమేష్‌కు ప్రమేయమున్నట్లు విచారణలో తేలిందని ఏఎస్పీ విమలకుమారి తెలిపారు.

పార్టీకి పూర్వ వైభవం తీసుకొద్దాం



పార్టీ అనుబంధ సంఘాల పదవులు పొందిన వారితో ప్రమాణం చేయిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



సమావేశంలో పాల్గొన్న, పార్టీ అనుబంధ సంఘాల నేతలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- అధికార పార్టీకి ప్రజల్లో పూర్తి స్థాయిలో వ్యతిరేకత
- కష్టపడి పనిచేయండి...భవిష్యత్తు మనదే
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి రాయచోటి : వైఎస్సార్ సీపీలో కార్యకర్తలకు సంబంధించి ఇంతకుముందు ఒక లెక్క. ఇక నుంచి మరో లెక్క..కష్టపడి పనిచేసే కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. అంతేకాదు పార్టీ కోసం ఇబ్బంది పడిన ప్రతి కార్యకర్తను మాజీసీఎం వైఎస్ జగన్ గుండెల్లో పెట్టుకుంటారు..అధికారంలోకి రాగానే మొదట కార్యకర్తల బాగోగులకే పెద్దపీట వేస్తాం.పార్టీకి పూర్వ వైభవం తీసుకు రావడమే లక్ష్యంగా ఇప్పటి నుంచి కష్టపడి పనిచేయండి అని అన్నారు. అధికార పార్టీపై ఎనిమిది నెలల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, భవిష్యత్తు మనదేనని. కలిసి కట్టుగా ముందుకు కదులుతూ జగన్‌పై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. రానున్న కాలంలో ప్రతి కార్యకర్తకు పార్టీతోపాటు అధినేత అండగా ఉంటారని తెలిపారు. గురువారం సాయంత్రం రాయచోటి పట్టణంలోని పీలేరు సర్కిల్ సమీపంలోఉన్న పీడీఆర్ కన్వెన్షన్ హాలులో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సమావేశంలో నూతనంగా నియమితులైన నూతన జిల్లా కార్యవర్గం 42 మంది,అనుబంధ విభాగాల అధ్యక్షులు 22 మందితో రాయచోటి మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు, కార్యకర్తలకు, అనుబంధ విభాగాల ప్రతినిధులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడూ వచ్చి వైఎస్ జగన్ సీఎం కావడం తథ్యమని అన్నారు.క్లాస్ కాదు..మాస్ కాదు....ఆంధ్ర ప్రజలందరూ జగన్‌ను కోరుకుంటున్నారన్నారు. ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ మాట్లాడుతూ 2029లో జగనే సీఎం అని అన్నారు. బీసీ, ఎస్సీ ఎస్టీలు బాగుండాలంటే వైఎస్ జగన్ సీఎం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

– శ్రీకాంత్ రెడ్డి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలి. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేదల ఇళ్లను అక్రమంగా కూల్చుతోందని, అక్రమ కేసులు పెడుతున్నారు. ఎన్ని కష్టాలు పెట్టినా అందరం కలిసికట్టుగా ముందుకే అడుగు వేయాలి. గతంలో జగన్ ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించాలి. కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను విస్మరించారు. పార్టీ నూతన కమిటీలు చురుగ్గా పనిచేయాలి. అధికార పార్టీ దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలి.

సైనికులుగా పని చేద్దాం

– ఆకేపాటి అమరనాథరెడ్డి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కార్యకర్తలతోపాటు అనుబంధ విభాగాల ప్రతినిధులు సైనికుల్లా పనిచేయాల్సిన సమయం ఆసన్నమైంది. కూటమి సర్కార్ నియంతృత్వ పోకడలను ధైర్యంగా ఎదుర్కొందాం. జగన్ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాం . కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది మాసాలవుతున్నా ఇచ్చిన హామీలన్నింటినీ అమలుచేయలేక ప్రజలను మోసగించింది. ఇటీవల చంద్రబాబు తీరును మాజీ ఎంపీ హర్షకుమార్ కూడా విమర్శించారు. అదే సమయంలో వైఎస్ జగన్‌ను పొగడని హర్షకుమార్ మంచి సీఎం అంటూ కితాబిచ్చారు. రానున్న రోజుల్లో ఎలాంటి ఎన్నికలైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. జగన్‌ను మరోసారి సీఎం గా చేసుకుంటే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుంది.

డైవర్షన్ పాలిటిక్స్ చంద్రబాబుకే చెల్లు:

– ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మైలేజ్ వస్తున్న ప్రతిసారీ చంద్రబాబుకు డైవర్షన్ రాజకీయాలు చేయడం అలవాటు.ప్రస్తుతం అమలవుతున్న ప్రభుత్వ పనితీరును పరిశీలిస్తే ఎనిమిది నెలల కాలానికే ఎంతో చెడ్డ పేరు వచ్చింది. ఇచ్చిన హామీలను చంద్రబాబు అమలు చేయక ప్రజలను మభ్యపెడుతున్నారు. వచ్చిన నిధులన్నీ అమరావతి, పోలవరంకే ఖర్చుచేస్తూ ఈ ప్రాంత అభివద్ధిని విస్మరించారు. అభివద్ధికి కేరాఫ్ వైఎస్సార్‌సీపీ. పార్టీ క్యాడర్ కసిగా పనిచేయాలి.

కూటమి ప్రభుత్వ పాలన అట్టర్ ఫ్లాప్:

– కొరముట్ల శ్రీనివాసులు

జగన్ ప్రభుత్వ ఐదేళ్ల పాలనను, ఎనిమిది నెలల చంద్రబాబు పాలనను ప్రజలు బేరీజు వేసుకుంటూ ఎవరిని కదిపినా బాధపడుతున్నారు. కూటమి ప్రభుత్వ పాలన అట్టర్ ఫ్లాప్. ప్రభుత్వ వైఫల్యాలను సోషియల్ మీడియా,మీడియాల ద్వారా పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలి. జగన్ కష్టపడిన ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుంటారు. పార్టీ కోసం అందరం కదం తొక్కుదాం.కూటమి ప్రభుత్వ ఆగడాలపై పోరాడుదాం.

వైఎస్సార్‌సీపీకి మంచిరోజులు వస్తాయి

– నిస్సార్ అహమ్మద్

రానున్న రోజుల్లో వైఎస్సార్‌సీపీ మంచిరోజులు వస్తాయి. గతంలో ఇచ్చిన హామీలను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లాగా పవిత్రంగా భావించి వైఎస్ జగన్ అమలు చేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించింది. రాజ్యాంగంలో హామీలు అమలు చేయకపోతే కాల్‌బ్యాక్ ఆప్షన్ పెట్టాలి. అప్పుడు ఇలాంటి కూటమి సర్కార్‌లకు బుద్ధి వస్తుంది. రానున్నకాలంలో కార్యకర్తలకు మంచి భవిష్యత్తు ఉంటుంది.

రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తున్న సీఎం చంద్రబాబు

సాక్షి రాయచోటి : సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని పీడీఆర్ కన్వెన్షన్ హాలులో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ పదవులు పొందిన వారితో ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ జగన్ హయాంలో కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలను క్యాలెండర్ ప్రకారం కొనసాగించి చరిత్ర సృష్టించారన్నారు. దేశంలోనే జగన్ ఒక్కరే విపత్కర సమయంలో ఆదుకున్న నాయకుడని కొనియాడారు. ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలతో ప్రజలను మభ్యపెట్టి, అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు వాటిని గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు.ఏడు నెలల పాలనలోనే రూ 1.19 లక్షల కోట్ల అప్పులు చేశారని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది పెన్షన్లను తొలగించారన్నారు. ఆర్థిక పరిస్థితి బాగా లేదంటూ హామీలను అమలు చేయలేనంటున్న బాబు ప్రజలపై 16 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని మోపడం శోచనీయమన్నారు. పార్టీ శ్రేణులు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. జగన్ సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. జగన్ సీఎం అయితే మా దెబ్బ ఏంటో రుచి చూపిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గడికోట శ్రీకాంత్‌రెడ్డి,, ఎస్వీ సతీష్ కుమార్‌రెడ్డి, అధికార ప్రతినిధులు ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి, కొరముట్ల, శ్రీనివాసులు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, మదనపల్లె ఇన్‌ఛార్జి నిసార్ అహ్మద్, నల్లారి తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

తల్లిదండ్రులు లేని పిల్లలను అక్కున చేర్చుకున్న కలెక్టర్



బాధితులకు కలెక్టర్ తరపున లక్ష రూపాయల చెక్కును అందజేస్తున్న డీఆర్‌ఓ మధుసూదన్

రాయచోటి అర్బన్ : తల్లిదండ్రులు ఇద్దరూ చనిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న నలుగురు పిల్లలను అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అక్కున చేర్చుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్‌లెక్చరర్‌గా పనిచేస్తున్న వి.వెంకటరమణ గుండెపోటుతో ఈ నెల 16వ తేదీన మరణించారు. ఇతని సొంత ఊరు రాయచోటి మండలం ఏపిలవంకపల్లి ఆరి హరిజనవాడ కాగా 2021లో కరోనా సమయంలో అతని భార్య రాజేశ్వరమ్మ కూడా చనిపోవడంతో వారి నలుగురు పిల్లలు అనాధలయ్యారు. దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న వారిని తీసుకుని ఉమ్మడి కడప జిల్లా కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్ జేఏసీ చైర్మన్ జానీబాబు, కో చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, సభ్యుడు శ్రీధర్‌లు రాయచోటి కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్రీధర్ చామకూరిని కలిసి వారి కుటుంబ పరిస్థితులు వివరించారు. దివంగత వెంకటరమణ నలుగురి సంతానంలో కుమారులు శ్రీనివాస్ ఫార్మసీ డిస్కంటిన్యూ, హర్షవర్ధన్ 5వ తరగతి, కుమార్తెలు లక్ష్మీ డిగ్రీ మొదటి సంవత్సరం, లాస్య 5వ తరగతి, చదువుతున్నారు. పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైన పరిస్థితుల్లో కలెక్టర్‌ను కలవడంతో స్పందించిన ఆయన ఒక్కొక్కరికి రూ.4 వేల వంతున ముగ్గురు పిల్లలకు నెలకు రూ.12 వేల పింఛన్ మంజూరు చేశారు. అది ఆ పిల్లలకు 18 సంవత్సరాలు నిండే వరకు ప్రతి నెలా వస్తుంది. దీంతోపాటు తక్షణ సాయంగా లక్ష రూపాయలను మంజూరు చేశారు. అలాగే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా కూడా ఆర్థికసాయం వచ్చేలా చేస్తానని ఆ పిల్లలకు అండగా ఉంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. బుధవారం రాయచోటిలో కలెక్టరేటలో డీఆర్‌ఓ మధుసూదన్ చేతుల మీదుగా డీఐఈఓ కృష్ణయ్య, ప్రిన్సిపల్ అమరేంద్ర, జిల్లా జేఏసీ కో చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి సమక్షంలో లక్ష రూపాయల చెక్కును పిల్లలకు అందజేశారు. అనంతరం కలెక్టర్ పిల్లలతో మాట్లాడుతూ బాగా చదువుకొంటే తన వంతు సహకరిస్తానన్నారు. కలెక్టర్ ఆ పిల్లల పట్ల తీసుకున్న శ్రద్ధకు జేఏసీ కో చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

శేష వాహన గోవిందా.. శ్రీ సూర్య దేవ గోవిందా..!



పెద్ద శేష వాహనంపై కడప రాయుడు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం స్వామి ఉదయం సూర్యప్రభ, రాత్రి పెద్ద శేష వాహనంపై కొలువుదీరారు. ఉత్సవాలలో భాగంగా ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, అర్చకులు మయూరం కృష్ణమోహన్ ఆధ్వర్యంలో త్రివిక్రమ్ బృందం ఉదయం స్నపన తిరుమంజనం నిర్వహించగా, సాయంత్రం ఊంజల సేవ చేశారు. ఆలయ ప్రాంగణంలో టీటీడీ కళాకారుల అన్నమాచార్య కీర్తనలు, ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హరికథ గానం భక్తులను అలరించింది. ఊరేగింపులో మహిళా భక్తుల కోలాట బృందాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. స్వామి పల్లకీలో మాడవీధుల్లో భక్తులకు దర్శనమిస్తుండగా, స్వామి రాకను తెలుపుతూ మహిళా భక్తులు పసుపు వర్ణ సంప్రదాయ దుస్తులు ధరించి భక్తిశ్రద్ధలతో దేవతామూర్తులను కొనియాడుతూ భక్తిగీతాలను కోలాట నృత్యాలు చేస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. స్థానిక భక్తులు కూడా వారితోపాటు కోలాటాలాడారు.

కడప రాయునికి కల్పవృక్షం కానుక

శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామికి ఆలయ అర్చక బృందం కల్పవృక్షాన్ని కానుకగా అందించారు. రూ. 6 లక్షలు విలువజేసే ఇత్తడి కల్పవృక్ష వాహనాన్ని స్వామి సేవలకు సమర్పిస్తున్నామని తెలిపారు.

దేవుని కడపకు ఒంటిమిట్ట రామయ్య అశ్వాలు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి రథానికి ఉన్న అశ్వాలు దేవుని కడప రథోత్సవానికి తరలివెళ్లాయి. దేవుని కడపలో ఫిబ్రవరి 4న రథోత్సవం జరగుతుంది. టీటీడీ అధికారుల ఆదేశాల మేరకు అశ్వాలను గురువారం రథం నుంచి వేరుచేసి ఓ ప్రైవేటు వాహనంలో తీసుకెళ్లారు.

ఆకలి తీరిస్తే.. పదింతలు మేలు





ప్రత్యేక తరగతుల్లో స్లిప్‌టెస్టులు రాస్తున్న విద్యార్థులు, వివేకానంద మున్సిపల్ పాఠశాలలో సాయంత్రం విద్యార్థులకు టిఫిన్ పెడుతున్న దృశ్యం (ఫైల్)

- అదనపు తరగతుల్లో అందని అల్పాహారం
- దాతలు స్పందిస్తారని విద్యార్థుల ఎదురుచూపులు

మదనపల్లె సిటీ : శత శాతం ఫలితాలే లక్ష్యంగా పాఠశాలల విద్యాశాఖ పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. జిల్లాలో 21,468 మంది పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. డిసెంబర్ 2వ తేదీ నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఈ తరగతులు కొనసాగుతున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా ప్రభుత్వం అల్పాహారం అందించకపోవడంతో విద్యార్థులు ఖాళీ కడుపులతో చదువుతున్నారు. ఆకలితో చదువుపై ఏకాగ్రత పెట్టలేకపోతున్నారు. ప్రభుత్వం చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

తొమ్మిది గంటలు పాఠశాలల్లోనే...!

ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేద,మధ్యతరగతి విద్యార్థులు చదువుతున్నారు. పేదరికం, ఇంట్లో తల్లిదండ్రులు ఉదయమే కూలీ పనులకు వెళ్లడం తదితర కారణాలతో ఏమి తినకుండానే పాఠశాలలకు వస్తున్నారు. అసలే పోషకాహార లోపాలతో బాధపడుతున్న వారు సరైన సమయానికి అల్పాహారం అందక నీరసపడిపోతున్నారు. పల్లెల్లో ఉదయం ఎనిమిది గంటలకే పాఠశాలలకు చేరుతున్న పదో తరగతి విద్యార్థులు ప్రత్యేక తరగతుల కారణంగా సాయంత్రం 5.30 వరకు ఉండాల్సి వస్తోంది.

గతంలో ఇచ్చారు....

గతంలో మున్సిపాలిటీల్లో ఉన్నతపాఠశాలల్లో మున్సిపల్‌శాఖ పదోతరగతి విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ అందించారు. దీంతో వారికి ఊరట కలిగేది. తరువాత దీనిని పూర్తిగా విస్మరించారు.

కొన్ని చోట్ల దాతల సాయం

దాతలు, స్థానికులు, ఉపాధ్యాయులు స్పందిస్తున్నారు. మదనపల్లె పట్టణం వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల(మాయాబజార్)లో దాతలు, ఉపాధ్యాయులు సహకారంతో డిసెంబర్ మొదటి వారం నుంచి సాయంత్రం టిఫిన్,స్నాక్స్ అందిస్తున్నారు. హెచ్‌ఎం పురం వెంకటరమణ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. దీంతో విద్యార్థులు ఉత్సాహంగా ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారు.

అల్పాహారంపై ఉత్తర్వులు రాలేదు



పదో తరగతి ప్రత్యేక తరగతుల దృష్ట్యా అదివారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టాలని ఆదేశించాం. వంద రోజుల ప్రణాళిక పకడ్బందీగా అమలు చేస్తున్నాం. సాయంత్రం స్నాక్స్ ఇవ్వలేదు. దీనిపై మాకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. – సుబ్రమణ్యం, డీఈఓ

బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం



మాట్లాడుతున్న స్త్రీ శిశు సంక్షేమశాఖ రాష్ట్ర కార్యదర్శి సూర్యకుమారి,పక్కనకలెక్టర్ శ్రీధర్

రాయచోటి : అన్నమయ్య జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ప్రత్యేకాధికారి సూర్యకుమారి ఐసీడీఎస్ అధికారులను, సూపర్ వైజర్లను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీ ఆర్‌ఎస్ హాల్‌లో ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ ఛామకూరి శ్రీధర్‌తో కలిసి ఆమె సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ అంగన్ వాడీ సేవలను పటిష్టవంతంగా నిర్వహించాలన్నారు. కిషోర వికాసం కార్యక్రమానికి సంబంధించి అంగన్ వాడీ, పాఠశాలలు, కళాశాలలో సఖి, యువ గ్రూపులను ఏర్పాటు చేసి వారంలో ఒకరోజు గ్రూపులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బాల్య వివాహాలను కట్టడి చేసేందుకు జిల్లాలో పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు ప్రత్యేకాధికారికి వివరించారు.జిల్లాకు మొదటిసారిగా వచ్చిన జిల్లా ప్రత్యేక అధికారి సూర్యకుమారికి జిల్లా కలెక్టర్ స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. మదనపల్లె, రాజంపేట సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, వైఖోమ్ నదియా దేవీ, ఐసీడీఎస్ కర్నూలు రీజనల్ జాయింట్ డైరెక్టర్, జిల్లా ఐసీడీఎస్ అధికారిణి పాల్గొన్నారు.



క్లుప్తంగా

యువతి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సభ్యులతో గొడవ పడి యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం పుంగనూరు మండలంలో జరిగింది. అలజనేరు సమీపంలో కోళ్లఫారంలో పనిచేస్తున్న బీహార్‌కు చెందిన భూతి కుమార్తె ప్రియాంక(20) ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవపడి పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు పుంగనూరు ఆస్పత్రికి తరలించగా, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బాధితురాలిని తిరుపతికి రెఫర్ చేశారు.

ఆరుగురిపై కేసు నమోదు

మదనపల్లె : మద్యం మత్తులో ఇరువర్గాలు గొడవపడటమే కాకుండా పోలీసులను అసభ్య పదజాలంతో దూషించి, విధులకు ఆటంకం కలిగించిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎరీషావలీ తెలిపారు. బుధవారం రాత్రి పట్టణంలోని మార్కెట్‌యార్డు ఎదురుగా నీరుగట్టువారిపల్లెకు చెందిన నాగ, వెంకటేష్ రెండు వర్గాలుగా విడిపోయి మద్యం మత్తులో గొడవపడ్డారు. నానా హంగామా సృష్టించారు. దీంతో స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గొడవను ఆపేందుకు ప్రయత్నించగా, మద్యం మత్తులో ఉన్న కొందరు పోలీసులపై తిరగబడి దూషించారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇరువర్గాలలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన నాగ, వెంకటేష్, శివాజీ, మరో ముగ్గురిపై పబ్లిక్ న్యూసెన్స్, పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన రెండు కేసులు నమోదు చేశామన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి

ఓబులవారిపల్లె : వై.కోట, సున్నపురాళ్లపల్లి గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారి పక్కన మద్యం మత్తులో రత్నయ్య (70) అనే వ్యక్తి గురువారం మృతి చెందాడు. పెనగలూరు మండలం కొండూరు ఎస్టీ కాలనీకి చెందిన రత్నయ్య చాలా సంవత్సరాల నుంచి వై.కోట ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. భార్య, కుమార్తె కొన్ని సంవత్సరాల క్రితం మృతి చెందగా బుధవారం రాత్రి ప్రధాన రహదారి పక్కనే ఉన్న భార్య సమాధి పక్కన అధికంగా మద్యం తాగి పడిపోయాడు. ఉదయాన్నే స్థానికులు రత్నయ్య చనిపోయిన విషయాన్ని గమనించి కుటుంబ సభ్యులకు తెలిపారు. మండల కేంద్రంలో రత్నయ్య ట్రాక్టర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తూ ఉండేవాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ట్రాక్టర్‌ను ఢీకొనడంతో బోల్తాపడిన కోళ్ల వాహనం

ఖాజీపేట : ఆంజనేయకొట్టాలు నుంచి బద్వేలుకు వెళ్లే రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు.. వివరాలిలా.. కదిరి, రాయచోటి, కడప నుంచి కోళ్ల వ్యర్థాలతో నెల్లూరుకు బొలెరో వాహనం వెళుతోంది. ఖాజీపేట మండలం బోసిరెడ్డిపల్లె సమీపంలోని ప్రధాన రహదారి వద్దకు రాగానే ఆగి ఉన్న ఇసుక ట్రాక్టర్‌ను గురువారం తెల్లవారు జామున బొలెరో వాహనం ఢీకొంది. వాహనంలో డ్రైవర్‌తోపాటు ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. అందులో బత్తిన హరికృష్ణ(26) అక్కడికక్కడే మృతి చెందగా వీరన్నతో పాటు మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృతి చెందిన వ్యక్తి నంద్యాల జిల్లా గడివేముల మండలం పెద్ద చింతకుంట గ్రామానికి చెందిన వాడిగా తెలిసింది. పోలీసులు మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

అప్పటి అఘోరాల ఆవాసం.. లంకమల

- 4-14 శతాబ్దాల మధ్య మనుగడ సాగించారు
- బండలపై శివుడి పాదాలు చెక్కి పూజలు
- అభయారణ్యంలో శివాలయం, గుహలు
- శతాబ్దాలు గడిచినా చెరిగిపోని గుర్తులు
- అటవీ శాఖ రేంజర్ తీసిన చిత్రాలతో వెలుగులోకి



లంకమల అభయారణ్యంలో బండపై చెక్కిన శివుడి పాదాలు

బి.కొత్తకోట : ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు వేల సంఖ్యలో అఘోరాలు వస్తున్నారు. ప్రతి కుంభమేళాకు పెద్ద సంఖ్యలో వచ్చే ఈ అఘోరాలు హిమాలయాల్లో ఉంటారని చెబుతుంటారు. అయితే, 4-14 శతాబ్దాల మధ్య అఘోరాలు ఆంధ్రప్రదేశ్‌లోనూ మనుగడ సాగించినట్లు పురాతత్వ శాఖ చెబుతోంది. అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గం సిద్దవటంలోని లంకమల అభయారణ్యం బ్రాహ్మీ లిపి కాలంలో అఘోరాలకు ఆవాసమని ఆ శాఖ నిర్ధారించింది. ఇక్కడ లభించిన వివిధ శతాబ్దాలకు చెందిన లిపి, భాష, బండలపై చెక్కిన పాదాల ఆధారంగా ఈ నిర్ధారణకు వచ్చింది. దీన్నిబట్టి చూస్తే లంకమల అభయారణ్యంలో ఇప్పటి వరకు వెలుగుచూడని రహస్యాలు దాగి ఉన్నాయని చెబుతున్నారు. ఇక్కడ అఘోరాలు భయంకరమైన ఆకారాలతో ఉండేవారని, శివుడిని ఆరాధిస్తూ గుహల్లో నివాసం ఉండేవారనడానికి చారిత్రక ఆధారాలు లభ్యమయ్యాయి. వారు శైవం వ్యాప్తికి పాటుపడినట్టుగా ఈ ఆధారాలు చెబుతున్నాయి. అటవీశాఖ సిద్దవటం రేంజర్ కళావతి అడవిలో తిరుగుతున్న సమయాల్లో కనిపించిన వీటిని ఫొటోలు తీయడంతో ఈ చరిత్ర వెలుగులోకి వచ్చింది.

బండలపై శివుడి పాదాలను చెక్కి..

సిద్దవటానికి 4 కిలోమీటర్ల దూరంలోని వెలుగుపల్లి, జంగాలపల్లి అటవీ ప్రాంతంలో బండలపై పాదాలు, పక్కనే శంఖు లిపిలో చెక్కిన అక్షరాలు ఉన్నాయి. వీటి ఆధారంగా అఘోరాలు ఇక్కడ శివుడిని ఆరాధించే వారని వెల్లడైంది. బండరాయిపై పాదాలను పలుచోట్ల చెక్కారు. ఒక బండపై చెక్కిన పాదాలకు వేళ్లు కూడా ఉన్నాయి. మిగతా వాటికి ఇలా లేవు. ఇదే అటవీ ప్రాంతంలో ఓ శివాలయం కూడా ఉండేదని భావిస్తున్నారు. బుద్ధుడు, మహావీరుని పాదాలను చెక్కిన విధంగానే లంకమలలో అఘోరాలు కూడా బండలపై శివుడి పాదాలను చెక్కి పూజించేవాళ్లని భావిస్తున్నారు. ఇందుకు గుర్తుగా సంస్కృత భాష-నాగర లిపి కలిపి ఓ చోట బండపై 'శ్రీ విశిష్ట కంకణధారి' అనే నామం రాసి ఉంది. శివుడ్ని పిలుచుకునే పేర్లలో ఇదొకటని గుర్తించారు. సంస్కృతంలో చెక్కిన ఈ అక్షరాలను బట్టి శ్రీ అనేది గౌరవసూచకం, విశిష్ట అంటే ప్రత్యేకమైనది అని అర్థం. కంకణ అంటే కంకణం లేదా మణికట్టు, ధారి అంటే ధరించిన వాడు లేదా పట్టుకున్న వాడు అని అర్థం. శివుడి చేతిలో శూలం ఉంటుంది కనుక ఈ అర్థం వచ్చేలా కంకణధారి అని చెక్కి ఉండొచ్చని చెబుతున్నారు. కంకణధారి అనేది శివుడికి సంబంధించిన లక్షణంగా చెబుతారు. కనుక శ్రీ విశిష్ట కంకణధారి అనే పేరు శివుడిని సూచించేదేనని పురాతత్వ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనిపై సమగ్ర అధ్యయనం చేస్తే లంకమల అభయారణ్యంలో దాగిన ఎన్నో రహస్యలు వెలుగులోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు.

సౌత్‌జోన్ ఉడ్‌బాల్ పోటీల్లో మదనపల్లె విద్యార్థుల ప్రతిభ



సౌత్‌జోన్ ఉడ్‌బాల్ విజేతలతో శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్.ఆర్.గురుప్రసాద్

మదనపల్లె : ఏపీ ఉడ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి 28, 29 తేదీల్లో కర్నూలు డీఎస్‌ఏ అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన సౌత్‌జోన్ ఉడ్‌బాల్ పోటీల్లో మదనపల్లె విద్యార్థులు ప్రతిభ కనపరిచి విజయం సాధించారు. సౌత్‌జోన్ ఉడ్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల జట్లు పాల్గొన్నాయి. వీటిలో ఆంధ్రప్రదేశ్ పురుషుల జట్టు, మహిళల జట్టు(ఒక్కో జట్టుకు నలుగురు ఆటగాళ్లు) పాల్గొంటే, అందులో పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు పురుషులు, ముగ్గురు మహిళలు ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీల్లో పురుషుల విభాగం ఫైనల్స్ మ్యాచ్‌లో తెలంగాణ జట్టుపై ఆంధ్ర జట్టు, మహిళల విభాగంలో తమిళనాడు జట్టుపై ఆంధ్ర జట్టు విజయం సాధించాయని రాష్ట్ర ఉడ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇ.ప్రభాకర్ ప్రకటించారు. ఉడ్‌బాల్ పోటీల్లో పాల్గొని మదనపల్లెకు చేరుకున్న ఆంధ్ర జట్టు విద్యార్థులను కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ సురభి రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాఘువేంద్ర అభినందించారు. అలాగే ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖలో నిర్వహించిన అంతర్ జిల్లా కబడ్డీ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు పోటీచేసి తృతీయస్థానం దక్కించుకుందన్నారు. అందులో జ్ఞానాంబిక విద్యార్థినులు శిరీషా, కావేరి పాల్గొన్నారని తెలిపారు.

సిద్దవటంలో కుష్టు వ్యాధిపై అవగాహన



కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం కుష్టు వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం జరుగుతుందన్నారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, చెవులపై, వీపుపై, ఎదపై, నొప్పిలేని బొడిపెలు, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం వంటి లక్షణాలు ఉన్నవారు స్థానిక వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లెప్రసీ అధికారి రవిబాబు, పి. కొత్తపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రంగలక్ష్మీ, పాఠశాల హెచ్‌ఎం శ్రీరాములు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయలసీమలో రాజధాని నిర్మిస్తే భూములు ఇచ్చేందుకు సిద్ధం

పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్



మీడియాతో మాట్లాడుతున్న సాకే శైలజానాథ్

వేంపల్లె : కూటమి ప్రభుత్వం రాయలసీమలో రాజధాని నిర్మిస్తే అనుకూలమైన భూములు ఇచ్చేందుకు రాయలసీమ వాసులు సిద్ధంగా ఉన్నారని పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అమరావతి కోసం బురద నేలల్లో, గుంతల్లో ఎందుకు కష్టపడుతున్నారని, రాయలసీమ వాసులు కూడా హక్కు కలిగినవాళ్లమని, కనుక రాజధాని తమకు ఇవ్వాలని కోరారు. రాయలసీమకు ఓ చరిత్ర ఉందని, పెద్ద, పెద్ద సామ్రాజ్యాలు చూసిన ప్రాంతమన్నారు. రాయలసీమలోని ఏ జిల్లాలోనైనా రాజధానిని తెచ్చి పెడితే సహకరిస్తారని, కర్నూలులో బెంచ్ అవసరం లేదని, హైకోర్టును ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజారోగ్యాన్ని కూటమి ప్రభుత్వం దెబ్బతీస్తోందన్నారు. సూపర్ సిక్స్ పథకాలకు నరేంద్ర మోదీ, అమిత్ షా అనుమతి ఉంది కదా ఎందుకు సీఎం చంద్రబాబు అంత దైన్యంగా మాట్లాడుతున్నారని ఆయన ప్రశ్నించారు. ధైర్యంగా సూపర్ సిక్స్ పథకాలకు నిధులు మంజూరు చేయాలని ప్రధాని నరేంద్ర మోడీని చంద్రబాబు నిలదీయాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిపోయిందని, గాడిలో పెట్టేందుకు కొంత సమయం పడుతుందని, అంత వరకు సంక్షేమ పథకాలు అమలు చేయలేమని, ప్రజలపై పన్నుల భారం తప్పదని, సీఎం చావు కబురు చల్లగా చెప్పడం దురదృష్టకరమన్నారు. సమావేశంలో పులివెందుల నియోజకవర్గం సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి, అనంతపురం మాజీ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ లూజు విక్రయాలపై కేసు నమోదు

ప్రొద్దుటూరు : స్థానిక సంజీవయ్యనగర్ వద్ద గ్యాస్ లూజు విక్రయాలు చేస్తున్న వ్యాపారి బ్రహ్మయ్యపై పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున కేసు నమోదు చేశారు. గోబీ సెంటర్ నిర్వహిస్తున్న వ్యాపారి బ్రహ్మయ్య షాపులో గ్యాస్ లూజు విక్రయాలు చేస్తున్నాడు. చాలా కాలంగా ఆయన పొయ్యిలకు, ఆటోలకు కిలోల చొప్పున సబ్సిడీ గ్యాస్‌ను విక్రయిస్తున్నాడు. ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు గురువారం దాడి చేసి మూడు సిలిండర్లను సీజ్ చేశారు. 6ఏ కేసు నమోదు చేసి జిల్లా జాయింట్ కలెక్టర్‌కు పంపినట్లు డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు.


ఐసీఎల్ ఉద్యోగి ఆత్మహత్య

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలోని ఐసీఎల్ కర్మాగారంలో పనిచేస్తున్న కునిశెట్టి వెంకటనారాయణ (50) యాసిడ్ తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ముద్దనూరు మండలం పెనికలపాడు గ్రామానికి చెందిన వెంకటనారాయణ ఐసీఎల్ కాలనీలోనే నివాసం ఉంటున్నాడు. ఇతనికి భార్య క్రిష్ణవేణితో పాటు ఇద్దరు కుమారులు రాజేష్, చంద్రశేఖర్ ఉన్నారు. పెద్దకుమారుడు రాజేష్ లండన్‌లో ఎంఎస్ చదువుతున్నాడు. చిన్నకుమారుడు చంద్రశేఖర్ హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడి భార్య క్రిష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కెనరా బ్యాంకులో మహిళ బంగారం అపహరణ

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని ప్రొద్దుటూరు రహదారిలో ఉన్న కెనరా బ్యాంకులో 4 తులాల బంగారం అపహరణకు గురైనట్లు పట్టణ సీఐ ఎస్. లింగప్ప తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండల పరిధిలోని పెద్ద దండ్లూరు గ్రామానికి చెందిన ఇరగం రెడ్డి సావిత్రి గురువారం తనకున్న 3 తులాల బంగారు తాళిబొట్టు సరుడు, తులం బంగారు చైను బ్యాంకులో కుదువపెట్టి డబ్బులు తీసుకునేందుకు వచ్చింది. బంగారును పర్సులో పెట్టి కట్టెల బ్యాగ్‌లో పెట్టుకుంది. గమనించిన ఇద్దరు మహిళలు కట్టెల బ్యాగును కోసి బంగారాన్ని తీసుకుని ఉడాయించారు. ఆమె అధికారుల వద్దకు వెళ్లి బంగారు తాకట్టు పెట్టేందుకు పర్సును చూడగా కనిపించలేదు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు బ్యాంకుకు వెళ్లి సీసీ పుటేజ్‌ను పరిశీలించారు.

అధికారుల ఒత్తిడి.. ఆగిన రైతు గుండె



ఆకుల పుల్లయ్య (ఫైల్)

కలసపాడు : రాజకీయ నేత ఒత్తిళ్లకు తలొగ్గిన మండల రెవెన్యూ అధికారులు ఓ రైతు నిండు ప్రాణాన్ని బలితీసుకున్నారు. ఆ రైతు గోడును ఏమాత్రం పట్టించుకోకుండా పోలీసుల సహకారంతో రైతు గడ్డివామి, దిబ్బలను అన్యాయంగా తొలగించారు. కలసపాడు మండలం చింతపల్లె గ్రామానికి చెందిన ఆకుల పుల్లయ్య (68) బుధవారం రాత్రి అకస్మాత్తుగా తీవ్ర ఒత్తిడికి గురై మృతి చెందాడు. గ్రామంలో సర్వేనెంబర్ 1113లో 49 సెంట్ల ప్రభుత్వ స్థలం ఉంది. అందులో గ్రామంలోని కొంత మంది గత కొన్ని సంవత్సరాలుగా గడ్డివాములు, పేడదిబ్బలు వేసుకుంటున్నారు. మరికొంత మంది రైతుల వద్ద కొందరు కొనుగోలు చేసి ఆ స్థలంలో కంచెలు, చెట్లను వేసుకున్నారు. 1994లో గ్రామానికి చెందిన కమలాపురం కాశిరెడ్డి వద్ద పాడుబడిన మిద్దె, ఖాళీ స్థలం రూ.2.50 లక్షలకు ఆకుల పుల్లయ్య కొనుగోలు చేశాడు. కొనుగోలు చేసిన ఖాళీ స్థలం ప్రభుత్వ భూమి అని ఈ నెల 24వ తేదీన జేసీబీతో రెవెన్యూ అధికారులు చదును చేశారు. ఆకుల పుల్లయ్య ఆధీనంలో ఉన్న స్థలం రెవెన్యూ అధికారులు చదును చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురై బుధవారం రాత్రి గుండెపోటుతో పుల్లయ్య మృతి చెందాడు.

ఆదాయానికి 'గండి' కొట్టే యత్నం!

చక్రాయపేట : గండి వీరాంజనేయుడి దగ్గర మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు సమర్పించే తలనీలాలను పోగు చేసుకునే హక్కు తో పాటు ఒక భాగం కొబ్బరి చిప్పలు సేకరించుకునేందుకు దేవదాయశాఖ అధికారులు నిర్వహించిన టెండర్లలో టెండరుదారుల పాచిక పారలేదు. స్వామి ఆదాయానికి గండి కొట్టి లబ్ధి పొందాలనుకుని అందరూ సిండికేట్ కావడంతో అధికారులు టెండర్లను రద్దు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గండిలో ఏడాది కాలం పాటు తలనీలాలు సేకరించుకునే హక్కు కోసం రు.25 లక్షల చొప్పున డిపాజిట్ మొత్తం చెల్లించి టెండర్లలో 9 మంది పాల్గొన్నారు. గత ఏడాది తలనీలాల టెండరు రు.65 లక్షలు పలికింది. ఈ మొత్తంతో పాటు ప్రస్తుతం మార్కెట్‌లోని వెంట్రుకల ధరలను బేరీజు వేసుకొని ఆలయ అధికారులు వేలం పాటను రూ.60 లక్షల నుంచి ప్రారంభించారు. ఇందుకు ఎవరూ నోరు మెదపక పోవడంతో తగ్గించుకుంటూ చివరకు రూ.49 లక్షలతో పాటను మొదలు పెట్టినా ఎవరూ ముందుకు రాలేదు. దీంతో అధికారులు తలనీలాల టెండర్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఒక భాగం కొబ్బరి చిప్పలు సేకరించుకొనే హక్కుకు నిర్వహించిన టెండర్లలోనూ అదే పరిస్థితి నెలకొనడంతో అధికారులు దాన్ని కూడా రద్దు చేశారు. కాగా కొందరు ఎలాగైనా తమకే టెండరు దక్కాలని లేకుంటే మీరు ఇక్కడి నుంచి వెంట్రుకలు, కొబ్బరి చిప్పలు ఎలా తీసుకెళతారో మీ అంతు చూస్తామని బెదిరింపులకు దిగడంతోనే బయటి ప్రాంతాల నుంచి వచ్చిన వారు నోరు మెదపకుండా కూర్చున్నట్లు ప్రచారం జరుగుతోంది. లేదంటే పెద్ద ఎత్తున తమకు కమీషన్లు ఇవ్వాలని కూడా బెదిరించినట్లు సమాచారం.

మళ్లీ టెండర్లు పిలుస్తాం

తలనీలాలు, కొబ్బరి చిప్పల టెండర్లలో తగిన ధర రానందున టెండర్లను రద్దు చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. దేవదాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకు తిరిగి టెండర్లను పిలుస్తామని చెప్పారు. ఆలయ చైర్మన్ కావలి కృష్ణ తేజ, మాజీ చైర్మన్లు వెంకటస్వామి, వీరభాస్కరుడు, ఆలయ ప్రధాన, ఉప ప్రధాన ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజ గోపాలాచార్యులు, కడప దేవదాయ శాఖ పర్యవేక్షకుడు శివయ్య, ఆలయ సూపరింటెండెంట్ షరీఫ్,ఎస్ఐ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERIVCES

TOURS & TRAVELS

■ మహా కుంభమేళా యాత్ర. 12రో. త్రివేణి సంగమం 2x2 Push Back Seates బస్సు యాత్ర 1 టికెట్టు 20,500 7రో..విమాన ప్రయాణం1 టికెట్టు 32,000(ఉ.టిఫిన్, 2పూటల భోజనం, రూం బాడుగ, గైడ్). సంప్ర.శ్రీ సాయిరాం టూర్స్ & ట్రావెల్స్,తిరుపతి, 9440161652, 9440009632.

షిర్డిసాయి జ్యోతిష్యాలయము

■ శ్రీ సాయిరాం జోషి గారు ప్రజల కోరక పై ప్రొద్దుటూరు విచ్చేసియున్నారు. [illegible] ముఖ లక్షణం, ఫోటో చూసి ఖచ్చితమైన భవిష్యత్ చెప్పగలరు. ఉన్నతవిద్య, వివాహం, ఉద్యోగం, వ్యాపారం, సంతానం,ఆరోగ్యం, కుటుంబ సమస్యలు, స్త్రీ ప్రేమ, ఆర్థిక సమస్యలు, రాజకీయం, రియల్ ఎస్టేట్ ఇంకా ఎటువంటి సమస్యలు ఉన్నా షిర్డిసాయి బాబా పూజ చేసి ఖచ్చితమైన పరిష్కారం చేయగలరు. సంప్ర : రూం నెం : 101, [illegible], ప్రొద్దుటూరు.సంప్ర: 9868068492

WANTED

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 20-25 వేల వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418, 81218 18692.

■ కస్టబ్లిస్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికిస్త్రీలు/పురుషులు,ఆయా,నర్సులు,వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ:15 వేలు - 40వేలు,ఫ్రీరూం+భోజనం,HYD. 7993583999.

■ హోండాకార్స్ మరియు ఏథర్‌బైక్స్ షోరూంల కోసం కడప, రాజంపేట, రాయచోటి, ప్రొద్దుటూరు నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 7093909125

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

గమనిక

[illegible]

విచారణతో వెలుగులోకి అక్రమాలు

- దేవదాయ భూమి ఇసుక తరలింపు
- ఆంజనేయస్వామి మాన్యంలో దుకాణాల ఏర్పాటు, అద్దెల వసూళ్లపై ఆరోపణలు
- విచారణ జరిపి, పరిశీలించిన డిప్యూటీ కమిషనర్



చెన్నకేశవస్వామి భూమిని పరిశీలిస్తున్న రామాంజనేయులు

బి.కొత్తకోట : దేవదాయ ధర్మాదాయశాఖకు చెందిన భూమిలో అక్రమంగా ఇసుక తరలింపు, ఆలయాల భూమిలో ప్రైవేటు వ్యక్తులకు లీజులు, అనుమతి లేకుండా బంకుల ఏర్పాటు తదితర అక్రమాలపై గురువారం కర్నూలు డిప్యూటీ కమిషనర్ ఎస్.రామాంజనేయులు విస్తృత పరిశీలనలు, విచారణ జరిపారు. స్థానికుడు చిట్టా రామకృష్ణారెడ్డి చేసిన ఫిర్యాదుపై లోకాయుక్త విచారణకు ఆదేశించగా దేవదాయశాఖ కమిషనర్ విచారణాధికారిగా ఆయనను నియమించారు. దీనిపై ఆయన పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. చెన్నకేశవస్వామి ఆలయానికి సంబంధించి ఆలేటి వాగు ప్రవహించే పక్కన ఉన్న భూమిలో ఇసుకను తరలించుకున్నారు. దీనిపై సర్వేయర్ ముబారక్ భూమి వివరాలు, హద్దులను చూపించారు. ఈ భూమిలో ఇసుక తరలిపోయిన వివరాలను ఈఓ, ఆలయ పూజారి, ఫిర్యాదుదారు వివరించారు. ఈ భూమికి నివేదిక ఇవ్వడంతోపాటు హద్దులు పెట్టాలని సర్వేయర్‌ను కోరారు. స్థానిక పీటీఎం రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయ భూమిని పరిశీలించిన రామాంజనేయులు అవాక్కయ్యారు. భూమిలో వెలసిన బంకులు, దుకాణాలపై ఆరా తీశారు. వీటికి ఎవరు అనుమతులు ఇచ్చారు, అద్దెను ఎవరు వసూలు చేస్తున్నారని ఈఓ మునిరాజాను ప్రశ్నించారు. ఇలా పర్యవేక్షణ లేకుండా వదిలేస్తే భూమిని ఎలా కాపాడతారని ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడినుంచి గంగమ్మ మాన్యంలోకి వెళ్లి అక్కడి లీజుదారులతో మాట్లాడగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. కొన్నేళ్లుగా లీజుదారులు ఇస్తున్న వేలాది రూపాయల సొమ్ముకు రశీదులు ఇవ్వలేదని, ఈసారి మాత్రమే ఇచ్చారని ఆయన దృష్టికి తెచ్చారు. కొందరైతే లీజు భూమి పొందినా వెరొకరికి లీజుకు ఇచ్చారని తేలింది. ఇలా ఎందుకు జరుగుతోందని అధికారులను ప్రశ్నించారు. అనంతరం తహసీల్దార్ అజారుద్దీన్‌తో సమావేశమైన రామాంజనేయులు చెన్నకేశవస్వామి భూమికి పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి, దానికి సంబంధించి నివేదిక ఇవ్వాలని కోరారు. నవంబర్ 26న సాక్షిలో ప్రచురితమైన చెన్నకేశవస్వామీ..నీ భూమి గోవిందా. శీర్షికన ప్రచురితమైన కథనంపై స్పందించారు. ఆలయానికి చెందిన భూములు సంబంధంలేని ఆలయం పేరుతో నమోదయ్యాయని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ విచారణలో వెలుగులోకి వచ్చిన అంశాలు, మాన్యం భూమి స్థితిపై పూర్తిస్థాయిలో కమిషనర్‌కు నివేదిక ఇస్తామని చెప్పారు. ఈ విచారణలో ఇన్‌స్పెక్టర్ శశి కుమార్, ఈఓ మునిరాజా, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, విచారణ సమయంలో సరైన రికార్డులు చూపించని కారణంగా ఈఓ మునిరాజాపై డిప్యూటీ కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు.

పేదలకు మేలు చేయడమే విధ్వంసమా...!

వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్ : పేదలకు మేలు చేయడమే విధ్వంసమా...అని వైస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. గురువారం కడపలోని ఎంఎస్ఆర్ హిల్ వ్యాలీలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ జిల్లా సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పెద్దిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు సూపర్ సిక్స్‌తోపాటు అనేక హామీలిచ్చారని, ఇప్పుడు ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేదని మాట మారుస్తున్నారన్నారు. ఇంటర్నేషనల్ ఎకనమిక్ ఎక్స్‌పర్ట్‌ని, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ బాగా తెలుసని చెప్పిన చంద్రబాబుకు హామీలిచ్చే ముందు ఆర్థిక పరిస్థితి తెలీదా అని ఎద్దేవా చేశారు. అబద్దాలపై అబద్దాలు చెప్పి ప్రజలను మోసగించారని, జనం కూడా తమకు బాబు హామీల వల్ల ఏడాదికి రూ.10లక్షలైనా వస్తుందని ఆశపడి ఓట్లు వేశారన్నారు. ఎన్నికల్లో హామీలిచ్చి అమలు చేయకుండా ప్రజల మనోభావాలతో ఆడుకునే ఇలాంటి వ్యక్తులను రాజకీయాల్లో ఉంచాలా...వద్దా అన్నది వారే నిర్ణయించాలన్నారు. అధికారంలోకి వచ్చిన ఈ 8 నెలల్లోనే రూ.1.19లక్షల కోట్లు అప్పులు చేశారని, ఏ ప్రాజెక్టు చేపట్టకుండా, ఏ ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వకుండా దేనికోసం ఖర్చు చేశారని నిలదీశారు. అమరావతిలో కూడా సొంత లాభం, సొంత సంపాదన కోసమే ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలనే ఆలోచన చంద్రబాబుకు లేదని, తాము 18 మెడికల్ కళాశాలలను తెస్తే వాటిని అడ్డుకుంటున్నారన్నారు. పూర్తయిన పోర్టులను ప్రైవేటుకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేశారన్నారు. ఏదైనా మాట్లాడితే విధ్వంసం చేశారని అంటున్నారని, పేదలకు మేలు చేయడమే విధ్వంసమా అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అరాచకాలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రతీకారానికి పరాకాష్ట

- తాగునీటి శుద్ధి కేంద్రం తొలగింపు
- శిలాఫలకాలు ధ్వంసం
- రాయచోటిలో తెలుగు తమ్ముళ్ల దుర్మార్గం



జేసీబీ సాయంతో నీటి శుద్ధి కేంద్రాన్ని తొలగిస్తున్న దృశ్యం

రాయచోటి (టాస్క్‌ఫోర్స్) : తెలుగు తమ్ముళ్లకు కడుపు మంట రోజురోజుకు అధికమవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి కార్యక్రమాలను పక్కనపెట్టి ప్రజలకు జీవనం కల్పిస్తున్న దుకాణాలు, నివాస గృహాల తొలగింపుతోపాటు ప్రజలకు తాగునీటిని అందిస్తున్న ప్రభుత్వ నీటి శుద్ధి కేంద్రాలను సైతం తొలగిస్తూ మహదానందం పొందుతున్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు, శిలాఫలకాలను ధ్వంసం చేసి నామరూపాలు లేకుండా చేస్తున్నారు. తెలుగు తమ్ముళ్ల రాజకీయ పగ ప్రతీకారాలకు పాల్పడుతుండటంపై స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసే దిక్కులేదు కానీ ప్రజలకు అందుబాటులో ఉన్న వాటిని ధ్వంసం చేయడం ఎంతవరకు సమంజసమంటూ ప్రజలు ప్రశ్నిస్తునారు. రాయచోటి రూరల్ మండల పరిధిలోని మేజర్ పంచాయతీగా పేరొందిన చెన్నముక్కపల్లి పంచాయతీ, రాజులకాలనీ పాఠశాల వద్ద రూ. 6 లక్షలతో ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి కేంద్రాన్ని గురువారం సాయంత్రం తెలుగు తమ్ముళ్లు దగ్గర ఉండి తొలగించారు. సమీప ప్రాంతాలలోని ప్రజలు రూ. 5లు చెల్లించి బిందె మంచినీటిని తీసుకెళ్తుండేవారు. పంచాయతీ స్థలంలో ఏడాది క్రితం నిర్మించిన తాగునీటి శుద్ధి కేంద్రం ద్వారా సమీప ప్రాంతాల ప్రజలు తాగునీటితో ఇబ్బందులు లేకుండా గడిపేవారు. గురువారం సాయంత్రం నీటి శుద్ధి కేంద్రాన్ని పూర్తిగా తొలగించడంతోపాటు అక్కడ ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు, శిలాఫలకాలను, దిమ్మెలను జేసీబీతో ధ్వంసం చేసి ట్రాక్టర్ల సాయంతో వాటిని తొలగించారు. టీడీపీ నాయకుల చర్యలపై స్థానిక ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

టీడీపీ నాయకులు దౌర్జన్యం చేస్తున్నారు



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిని కలిసిన నాయకులు

పెద్దతిప్పసముద్రం : టీడీపీ నాయకులు దౌర్జన్యం చేస్తూ తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు ధనలక్ష్మి శనివారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఎదుట వాపోయింది. రాయచోటిలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ తాను కొనుగోలు చేసి రిజిస్ట్రర్ చేసుకున్న ఇంటికి టీడీపీ నాయకులు దౌర్జన్యంగా తాళాలు వేశారని పేర్కొంది. అదే విధంగా మండలంలో వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులపై టీడీపీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలను జిల్లా అధ్యక్షుడికి వివరించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఈ విషయంపై తాను జిల్లా ఎస్పీతో మాట్లాడతానన్నారు. కార్యకర్తలు ధైర్యంగా ఉంటూ ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక విస్మరించారనే విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎంపీపీ మహమూద్‌తో పాటు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు కేవీ రమణ, సీవీ రమణ, సుబ్బిరెడ్డి, గిరిస్వామి, వెంకటరెడ్డి, ఉత్తన్న, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై కేసు నమోదు

కొండాపురం : మండల పరిధిలోని చౌటిపల్లె పునరావాస కాలనీ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి భర్త జి. ఓంకార్ పై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. అదే కళాశాలలో గతంలో పనిచేసిన పి.వెంకట నాగలక్ష్మిని వేధించారనే ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు కొండాపురం ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2023 సంవత్సరంలో గురుకుల జూనియర్ కళాశాలలో సెక్యూరిటీ సూపర్ వైజర్‌గా పనిచేసే సమయంలో ప్రిన్సిపాల్ భర్త ఓంకార్ తనపట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని ఆమె ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ క్రిష్ణవేణిని వివరణ కోరగా వెంకట నాగలక్ష్మి అసత్య ఆరోపణలు చేయడం చాలా అన్యాయమన్నారు.